సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం ၊ 24 ၊ మే ၊ 2023



చీనీ టన్ను రూ.36 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.36 వేలు పలికాయి. మార్కెట్‌కు 569 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



పల్లెకు టికెట్ ఇవ్వొద్దు

పల్లె రఘునాథరెడ్డికి ఈసారి పుట్టపర్తి టీడీపీ టికెట్ ఇవ్వకూడదని పెదరాను ఆధ్వర్యంలో బుధవారం బుక్కపట్నంలో సమావేశమైన అసమ్మతి నేతలు తీర్మానించారు.

8లో

గరిష్టం/కనిష్టం

41.2°/23.2°

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం, ఉక్కపోత అధికంగా ఉన్నాయి. నైరుతి దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

రేపు జాబ్ మేళా



అనంతపురం టౌన్: అనంతపురంలోని జిల్లా ఉపాధికల్పనాధికారి కార్యాలయంలో ఈ నెల 25న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎ.కళ్యాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఆపైన విద్యార్హతలున్న యువతీ యువకులకు ఫ్లిప్‌కార్ట్, నవభారత్ ఫర్టిలైజర్స్ కంపెనీ ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని పేర్కొన్నారు. ఇంటర్వ్యూలో అర్హత సాధించిన అభ్యర్థులకు విద్యార్హతను బట్టి రూ.10 వేల నుంచి రూ.25వేల వరకు జీతం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అభ్యర్థులు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో గురువారం నాటి ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

'జగనన్న ఆణిముత్యాలు' వాయిదా

ప్రశాంతి నిలయం: పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేపట్టిన 'జగనన్న ఆణిముత్యాల అవార్డులు' ప్రదానోత్సవం కార్యక్రమం వాయిదా పడింది. ఈ మేరకు డీఈఓ మీనాక్షి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వాస్తవానికి ఈనెల 25వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారయ్యింది. అయితే అనివార్య కారణాలతో ఈ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు తెలిపారు. తదుపరి తేదీని ప్రభుత్వం త్వరలో ప్రకటిస్తుందని డీఈఓ పేర్కొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం



అరటి తోటను పరిశీలిస్తున్న రమణారెడ్డి

బత్తలపల్లి: అకాల వర్షాలు, పెనుగాలులకు పండ్ల తోటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, ఉద్యానశాఖాధికారి చంద్రశేఖర్ భరోసానిచ్చారు. బత్తలపల్లి మండలం లింగారెడ్డిపల్లిలో మంగళవారం పర్యటించారు. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షం, పెనుగాలులకు నేలమట్టమైన పది ఎకరాల్లోని అరటి తోటను పరిశీలించారు. బాధిత రైతులు రైతులు చంద్రశేఖర్‌రెడ్డి, గోవిందరెడ్డితో మాట్లాడుతూ.. అధైర్య పడవద్దని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకునేలా చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు. వారి వెంట మండల వ్యవసాయాధికారి ఓబిరెడ్డి, ఆర్‌బీకే వీఏఏ నిఖిత ఉన్నారు.

సాగులో ఉంటే పట్టాలిస్తాం



రైతులతో మాట్లాడుతున్న జేసీ చేతన్

ఓడీ చెరువు: శోత్రియం భూములను కొలతలు వేసి సరిహద్దులు ఏర్పాటు చేస్తామని జాయింట్ కలెక్టర్ టీ.ఎస్.చేతన్ తెలిపారు. మంగళవారం ఆయన తంగేడుకుంట గ్రామ పరిధిలోని లింగాలవారిపల్లి, గొల్లవారిపల్లి, నల్లచెరువుపల్లి, మద్దకవారిపల్లి, బుచ్చిరాజుపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో శోత్రియం భూములు సాగు చేసుకుంటున్న రైతులతో సమావేశమయ్యారు. పలువురు రైతులు తమకు ఎలాంటి హక్కు పత్రాలు లేవనీ, కొందరికి ఉన్నా లింక్ డాక్యుమెంట్లు లేకపోవడంతో రైత్వారీ పట్టాలు పొందలేకపోతున్నామని జేసీకి తెలిపారు. స్పందించిన జేసీ చేతన్ మాట్లాడుతూ, సాగు భూములకు సంబంధించి రైత్వారీ పట్టాలకు క్లయిములు ఇచ్చుకోవాలని సూచించారు. చాలా మందికి క్లయిములు లేకపోవడంతో పట్టాలివ్వడం ఇబ్బందిగా మారిందన్నారు. దీంతో అలాంటి వారి భూములను కూడా సర్వే చేసేందుకు రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్లుతో గ్రామానికి ఐదు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి కొలతలు వేయిస్తున్నట్లు తెలిపారు. రైతులు అందుబాటులో ఉండి భూములు సర్వే చేయించుకుని చెక్‌బందులు నిర్ధారించుకోవాలని సూచించారు. తొలుత క్లయిములు ఇచ్చుకున్న రైతులకు రైత్వారీ పట్టాలు అందచేస్తామన్నారు. ఆ తర్వాత సాగులో ఉన్న రైతులకు సంబంధించి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్వే అండ్ ల్యాండ్ అసిస్టెంట్ డైరెక్టర్ రామకృష్ణ, తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీఓ పోలప్ప, ఆర్‌ఐ నాగేంద్ర, మండల సర్వేయర్ వినోద్‌కుమార్‌రెడ్డి, వీఆర్‌ఓ సుధాకర్, సర్పంచు అబీదాబీ, ఎంపీటీసీ రమణయ్య పాల్గొన్నారు.

ఉమా..సాధించాడప్పా!



బొల్లం ఉమా మహేశ్వరరెడ్డి

- సివిల్స్‌లో మెరిసిన కదిరి యువకుడు
- ఆల్ ఇండియా స్థాయిలో 270వ ర్యాంకు

కదిరి: సివిల్స్‌లో కదిరి యువకుడు బొల్లం ఉమా మహేశ్వరరెడ్డి సత్తా చాటాడు. ఆల్ ఇండియా స్థాయిలో 270వ ర్యాంకు సాధించారు. అఖిల భారత సర్వీసుల్లో నియామకాల కోసం యూపీఎస్సీ నిర్వహించిన సివిల్స్-2022 ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఇందులో మొత్తం 933 మందిని యూపీఎస్సీ ఎంపిక చేసింది.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తూనే...

జాతీయ స్థాయిలో 270 ర్యాంకుతో మెరిసిన బొల్లం ఉమా మహేశ్వరరెడ్డి స్వగ్రామం ఓడీ చెరువు మండలం బోయపల్లి కాగా, వీరి కుటుంబం ప్రస్తుతం కదిరిలో స్థిర పడింది. తల్లి పద్మావతి విశ్రాంత ఉపాధ్యాయురాలు కాగా, తండ్రి రాజశేఖర్‌రెడ్డి విశ్రాంత జువాలజీ లెక్చరర్. కర్నూలు మాంటిస్సోరీలో పదో తరగతి చదివిన ఉమా మహేశ్వరరెడ్డి.. హైదరాబాద్‌లోని శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్, హైదరాబాద్‌లో ఐఐటీలో బీటెక్ పూర్తి చేశారు. ఢిల్లీలోని 'వాజీరా'లో సివిల్స్‌కు శిక్షణ తీసుకున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని అమెజాన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. తమ కుమారుడికి సివిల్స్‌లో మంచి ర్యాంకు రావడం పట్ల తల్లిదండ్రులు సంతోషం వెలిబుచ్చారు.

టీచర్ల బదిలీలకు 26 వరకు దరఖాస్తు

రాప్తాడు రూరల్: ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ టీచర్ల బదిలీలకు సంబంధించి ఈ నెల 26 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ తెలిపారు. బదిలీల షెడ్యూలును మంగళవారం ఆయన వెల్లడించారు. ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందన్నారు. 28, 29 తేదీల్లో ప్రొవిజినల్ సీనియారిటీ జాబితాలు విడుదల చేస్తామన్నారు. జాబితాపై అభ్యంతరాలుంటే 30న స్వీకరిస్తామన్నారు. మే 31, జూన్ 1 తేదీల్లో అభ్యంతరాలను పరిశీలిస్తామన్నారు. జూన్ 2, 3 తేదీల్లో వెబ్‌సైట్‌లో అర్హత పాయింట్లతో పాటు ఫైనల్ సీనియారిటీ జాబితాలు పొందుపరుస్తామన్నారు. జూన 4వ తేదీన ఖాళీలు ప్రకటిస్తామని వెల్లడించారు. 5 నుంచి 8వ తేదీ వరకు హెచ్‌ఎంలు, టీచర్లు ఆన్‌లైన్‌లో ఆప్షన్ ఇచ్చుకోవచ్చన్నారు. 9 నుంచి 11వ తేదీ వరకు జాబితా తయారు చేస్తామన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒకే పాఠశాలలో ఐదు విద్యా సంవత్సరాల సర్వీసు పూర్తయిన ప్రధానోపాధ్యాయులు, 8 విద్యా సంవత్సరాలు పూర్తయిన ఉపాధ్యాయులందరూ తప్పనిసరిగా బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రీ- అప్పోర్షన్మెంట్ మేరకు సర్‌ప్లస్ అయిన ఉపాధ్యాయులు, సబ్జెక్టు కన్వర్షన్ అయిన పాఠశాల సహాయకులందరూ తప్పనిసరిగా బదిలీకి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అసంబద్ధమైన, తప్పుడు ధ్రువపత్రాలు సమర్పిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వేరుశనగకే మొగ్గు!

మండు వేసవిలోనూ చెరువులు, చెక్ డ్యాంలలో జల సవ్వడులు వినిపిస్తున్నాయి. బోర్లన్నీ ధారాళంగా పారుతున్నాయి. కరెంటు సరఫరాకూ ఇబ్బంది లేదు. వరుణుడూ దయతలుస్తున్నాడు. భూగర్భ జలమట్టం పైపైనే కనిపిస్తోంది. నైరుతి సకాలంలోనే పలకరించే సూచనలున్నాయి. దీంతో రైతన్న రెట్టించిన ఉత్సాహంతో 'ముంగారు' సాగుకు సిద్ధమవుతున్నాడు. ప్రభుత్వం కూడా రాయితీ విత్తనంతో పాటు ఎరువులు పంపిణీ చేయనుండగా, ఈ సారి సాగు విస్తీర్ణం బాగా పెరగనుంది. ఈ మేరకు వ్యవసాయ శాఖ 2,96,196 లక్షల హెక్టార్లతో ఖరీఫ్ సాగు అంచనా తయారు చేయగా, అందులో పెద్దపంట చెనిక్కాయ ఏకంగా 2,01,713 హెక్టార్లలో సాగులోకి రావచ్చని భావిస్తున్నారు.



జిల్లాలో అత్యధికంగా సాగయ్యే వేరుశనగ

- ఖరీఫ్ సాగు అంచనా 2,96,196 హెక్టార్లు
- 2,01,713 హెక్టార్లతో పెద్దపంట వేరుశనగ
- వారం రోజుల్లో విత్తన వేరుశనగ పంపిణీ
- పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



ధర్మవరం మండలం దర్శినమలలో విత్తన నాణ్యత పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: జిల్లా రైతులు ఎప్పటిలాగే ఈ ఖరీఫ్‌లోనూ వేరుశనగ సాగుకే మొగ్గు చూపుతున్నారు. ఈ ఖరీఫ్‌లో 21 రకాల పంటల సాగుకు రైతులు సిద్ధం కాగా, అందులో వేరుశనగ సాగుకే ఎక్కువ మంది రైతులు మొగ్గు చూపుతున్నారు. ఆ తర్వాత కంది, వరి, మొక్కజొన్న, ప్రొద్దుతిరుగుడుతో పాటు జొన్న, ఉలవలు, అలసందులు, పెసలు, సజ్జలు, సోయాబీన్, ఆవాలు, మిరప, చెరకు, ఉల్లిగడ్డలు, పత్తి తదితర పంటల సాగుచేయాలని భావిస్తున్నారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ అధికారులు ఖరీఫ్ పంటల సాగు అంచనా తయారు చేశారు. ఈ మేరకు ఇప్పటికే రైతు భరోసా కేంద్రాలకు విత్తనం సరఫరా చేశారు.

గతానికి మించి అంచనా

గత ఖరీఫ్‌లో పంటల సాగును దృష్టిలో ఉంచుకొని అధికారులు ఈ సారి పంటల సాగు అంచనా తయారు చేశారు. గత ఖరీఫ్‌లో 2,70,651 హెక్టార్లు వర్షాధారం కింద వచ్చింది. ఈ సారి వర్షాధారం కిందే 2,96,196 హెక్టార్లు, నీటి వసతితో మరో 49,768 హెక్టార్లలో పంటలు సాగులోకి రావచ్చని అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు జిల్లా వ్యవసాయ శాఖ, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో విత్తన పంపిణీ, ఎరువులు సరఫరాపై ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు. గత ఖరీఫ్‌లో ప్రధాన పంట వేరుశనగ 1,83,376 హెక్టార్లలో పంట సాగులో రాగా, ఈ సారి ఏకంగా 2,01,713 హెక్టార్లలో సాగులో రావొచ్చని అంచనా వేస్తున్నారు. అలాగే ఈసారి కంది 42 వేల హెక్టార్లు, మొక్కజొన్న 10,670 హెక్టార్లు, ఉలవలు 16,848 హెక్టార్లు, పెసలు 2,896 హెక్టార్లలో సాగులోకి రావచ్చని అంచనా వేసినట్లు వ్యవసాయాధికారి సుబ్బారావు తెలిపారి.

రైతు చెంతకే విత్తనం

రైతుకు ఏ కష్టం కలగకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారానే సకలం పంపిణీ చేస్తున్న వైఎస్ జగన్ సర్కార్ ఖరీఫ్‌లో రైతులకు విత్తనాలు, ఎరువులు అన్నీ ఆర్బీకేల ద్వారానే పంపిణీ చేసేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జిల్లా రైతులకు కావాల్సిన 1,00,907 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కాయలు, 100 క్వింటాళ్ల కంది. 350 క్వింటాళ్ల రాగులు, 34 క్వింటాళ్ల జీలుగ విత్తనాలను అందుబాటులో ఉంచుతోంది. ఇప్పటికే సుమారు 12 వేల క్వింటాళ్ల వేరుశనగ కాయలను రైతు భరోసా కేంద్రాలకు సరఫరా చేయగా, రైతులు విత్తన రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారు. ఈనెల 29వ తేదీ నుంచి విత్తన కాయలను పంపిణీ చేయడానికి అధికారులు సిద్ధమవుతున్నారు.

వేరుశనగకు 40 శాతం రాయితీ

విత్తన వేరుశనగ ప్రభుత్వం 40 శాతం రాయితీ ఇస్తోంది. అలాగే కందులకు 30 శాతం, ఉలవలు 50 శాతం, రాగులు 50 శాతం, జీలుగ 50 శాతం సబ్సిడీతో అందించేందుకు ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ అరుణ్‌బాబు, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, వ్యవసాయాధికారులు తరచూ ఆర్‌బీకేలను సందర్శించి విత్తన నాణ్యతను పరిశీలిస్తూ తగు సూచనలు, సలహాలిస్తున్నారు.

సకాలంలో రుతుపవనాలు

జూన్ ప్రారంభంలోనే ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన నైరుతి రుతుపవనాలు విస్తరించే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ చెబుతోంది. సకాలంలోనే నైరుతి ప్రభావం చూపనుండగా, రైతులు కూడా అందుకు తగ్గట్టుగానే విత్తనానికి సిద్ధమవుతున్నారు.

ఖరీఫ్‌లో పంటల వారీగా సాధారణ సాగు అంచనా

పంట	హెక్టార్లు
వేరుశనగ	2,01,713
చిరుధాన్యాలు	69,551
ముతక ధాన్యాలు	9,848
ఇతర పంటలు	15,084
మొత్తం	2,96,196

పేద విద్యార్థికి ఆర్థిక దీవెన

- నేడు విద్యా దీవెన నగదు విడుదల
- జిల్లాలో 31,675 మంది విద్యార్థులకు లబ్ధి

జిల్లాలో జగనన్న విద్యా దీవెన లబ్ధి వివరాలు

కులం	విద్యార్థులు	నగదు
ఎస్సీ	141	రూ.21.73లక్షలు
ఎస్టీ	2,141	రూ.1.58 కోట్లు
బీసీ	19,295	రూ.14.66 కోట్లు
కాపు	2,872	రూ.2.36 కోట్లు
ఈబీసీ	3,768	రూ.4.21 కోట్లు
ముస్లిం మైనార్టీ	3,429	రూ.2.25 కోట్లు
క్రిస్టియన్ మైనార్టీ	29	రూ.2.44 లక్షలు

పుట్టపర్తి అర్బన్: పేద విద్యార్థుల ఉన్నత చదువులకు రాష్ట్ర ప్రభుత్వం కొండంత భరోసా ఇస్తోంది. జగనన్న విద్యా దీవెన పథకం కింద పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్, ఇతర ప్రొఫెషనల్ కోర్సులు చదివే విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నాలుగు విడతల్లో చెల్లిస్తోంది. 2022-23 తుది త్రైమాసికానికి సంబంధించి విద్యాదీవెన సొమ్మును బుధవారం తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు నుంచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి విడుదల చేయనున్నారు. జిల్లాలోని 31,675 మంది విద్యార్థుల తల్లుల ఖాతాలకు రూ.25.33 కోట్ల నగదు జమ కానుంది. స్థానికంగా కలెక్టరేట్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించే నిర్వహించే కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్‌బాబు, ప్రజాప్రతినిధులు మెగాచెక్కు అందజేస్తారని సాంఘిక సంక్షేమ శాఖ డీడీ శివరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

నాలుగు రోజుల్లో వర్షాలు

బుక్కరాయసముద్రం: జిల్లాలో రానున్న నాలుగు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు రేకులకుంటలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త అశోక్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పగటి ఉష్ణోగ్రతలు 40.0-41.8, రాత్రి ఉష్ణోగ్రతలు 26.6-27.4 డిగ్రీల సెల్సియస్ నమోదు కావచ్చని పేర్కొన్నారు. గాలిలో తేమ శాతం ఉదయం 54-68, మధ్యాహ్నం 22-32గా నమోదు అయ్యే అవకాశం ఉందని తెలిపారు.

బదిలీల కోసం దరఖాస్తుల వెల్లువ

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జెడ్పీ పరిధిలో ఖాళీలు 401
- ఐదేళ్ల సర్వీసు పైబడిన ఉద్యోగులు 120 మంది
- 2 నుంచి 5 ఏళ్లలోపు సర్వీసు కలిగిన వారు 293 మంది



జిల్లా పరిషత్ కార్యాలయ భవనం

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ పరిధిలో బదిలీల కోసం దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఎంపీడీఓలు మొదలుకొని కార్యాలయ సబార్డినేట్ల వరకు మొత్తం 1,317 పోస్టులకు గాను 922 మంది పని చేస్తున్నారు. 401 పోస్టులు ఖాళీ ఉన్నాయి. ఐదేళ్ల ఒకే చోట సర్వీసు పూర్తి చేసుకున్న వారు 120 మంది ఉండగా, 2 నుంచి 5 సంవత్సరాల లోపు ఒకే చోట సర్వీసు కలిగిన వారు 293 మంది ఉన్నట్లు జెడ్పీ అధికారులు మంగళవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు.

చిగురించిన ఆశలు

బదిలీల ప్రక్రియ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఉద్యోగుల్లో ఆశలు చిగురించాయి. ఒకే చోట ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసిన ఉద్యోగులకు కచ్చితంగా బదిలీ కావాలని ఆదేశించింది. రెండేళ్ల సర్వీసు పూర్తయిన వారు రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకోవచ్చని కూడా పేర్కొంది.

ఉద్యోగుల సందడి

జిల్లా, మండల పరిషత్ కార్యాలయాలతో పాటు జెడ్పీ ఉన్నత పాఠశాలలు, పంచాయతీరాజ్ శాఖ, ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్ (పీఐయూ), క్వాలిటీ కంట్రోల్ విభాగాల్లో డిప్యుటేషన్లపై పని చేస్తున్న ఉద్యోగుల్లో సందడి నెలకొంది. తాము కోరుకున్న ప్రాంతానికి బదిలీ కావాలని చాలా రోజుల నుంచి ఆశలు పెట్టుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకోవడంపై ఉద్యోగుల ఆనందానికి అవధుల్లేకుండాపోయింది. ఇప్పుడు వారంతా బదిలీ దరఖాస్తుకు సిద్ధమయ్యారు.

హోదా	మంజూరైన పోస్టుల సంఖ్య	ఖాళీలు	ఐదేళ్ల సర్వీసు పూర్తి	2-5 ఏళ్ల సర్వీసు
ఎంపీడీఓ	63	25	01	15
ఏఓలు	74	03	--	30
ఎస్‌ఏలు	120	02	04	37
జేఏలు	242	05	08	64
టైపిస్టులు	91	26	01	30
రికార్డ్ అసిస్టెంట్లు	203	41	46	35
ల్యాబ్ అసిస్టెంట్లు	63	20	14	07
లైబ్రరీ అసిస్టెంట్లు	02	01	01	00
ఆఫీస్ సబార్డినేట్లు	459	278	45	75
మొత్తం	1317	401	120	293

నాణ్యమైన విత్తనం ఇవ్వండి

- అధికారులకు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం



వివిధ పథకాల అమలుపై జిల్లా ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ధర్మవరం రూరల్: ఖరీఫ్‌లో వేరుశనగ పంటను సాగు చేసుకునే రైతులకు నాణ్యమైన విత్తన కాయలను పంపిణీ చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. నాణ్యతలో ఏ మాత్రం తేడా వచ్చినా విత్తనం వెనక్కిపంపాలన్నారు. రైతులు కూడా విత్తనం నాణ్యత పరిశీలించుకోవాలన్నారు. మంగళవారం ఆయన ధర్మవరం మార్కెట్ యార్డ్ వద్ద ఉన్న విత్తన వేరుశనగ శుద్ధి కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంపిణీకి సిద్ధం చేసిన వేరుశనగ కాయల నాణ్యతను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వేరుశనగ విత్తనం సంచీ బరువు 30 కేజీల 300 గ్రాములు తప్పకుండా ఉండేటట్లు చూడాలన్నారు. 29వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో విత్తన వేరుశనగ పంపిణీకి చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి వైవీ సుబ్బారావుకు సూచించారు. ఇందుకోసం ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలన్నారు. రిజిస్ట్రేషన్ల ఆధారంగా ఆయా రైతు భరోసా కేంద్రాలకు రావాల్సినంత విత్తనం ముందుగానే పంపాలన్నారు. అనంతరం గోదాములో నిల్వ చేసిన వేరుశనగ కాయల నిల్వ, స్టాకు రిజిస్టర్లను కలెక్టర్ తనిఖీ చేశారు. అనంతరం ఆయన మండల పరిధిలోని దర్శనమల పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ ద్వారా అందుతున్న సేవలు, రోజూ ఓపీ గురించి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పుష్పలతను ఆరా తీశారు. పీహెచ్‌సీలో పాము, కుక్క కాటుకు మందులు ఉన్నాయా? అని ప్రశ్నించగా, తగినంత నిల్వ ఉన్నాయని వైద్యురాలు సమాధానం ఇచ్చారు. అనంతరం కలెక్టర్ రోగులు వేచి ఉండే గది, రక్త పరీక్షా కేంద్రం, లేబర్ రూములు, మందులు నిల్వ ఉంచే గదులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ తిప్పేనాయక్, డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియా సాల్మన్, జిల్లా వ్యవసాయాధికారి వైవీ సుబ్బరావు, ఏడీ కృష్ణయ్య, తహసీల్దార్ యోగీశ్వరీదేవి, ఎంపీడీఓ మమతాదేవి, ఏపీ సీడ్స్ మేనేజర్ ధనలక్ష్మి, ఏఓ చెన్నవీరాస్వామి, సర్పంచ్ గోపాల్‌రెడ్డి, పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు జయకుమారి, కామేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

పుట్టపర్తి అర్బన్: మండల ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్ నుంచి వివిధ సంక్షేమ పథకాల అమలుపై జిల్లా ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 25న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని, సమగ్ర నివేదికలతో సిద్ధం ఉండాలన్నారు. ఏ శాఖ సమాచారం అడిగినా వెంటనే ఇచ్చే విధంగా ఉండాలన్నారు. అలాగే నిర్దేశిత లక్ష్యాల సాధనకు ప్రణాళికా బద్ధంగా పని చేయాలని సూచించారు. లేదంటే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవన్నారు. 'నాడు-నేడు' పనులు వేగవంతం చేయాలని, పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులందరికీ విద్యాకానుక కిట్లు పంపిణీకి శ్రీకారం చుట్టాలన్నారు. జగనన్న విద్యాదీవెన కార్యక్రమం ద్వారా డిజిటల్ అక్నాలెడ్జ్‌మెంట్ పనులు వంద శాతం పూర్తి చేయాలన్నారు. మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు తరచూ పాఠశాలలను తనిఖీ చేసి గుర్తించిన సమస్యలను 'కన్సిస్టెంట్ రిథం' యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ సర్వేలు నిర్వహించి సమగ్ర సమాచారాన్ని సేకరించాలన్నారు. 0-5, 6-19 ఏళ్లలోపు పిల్లల ఆధార్ అప్‌డేట్‌కు చర్యలు తీసుకోవాలన్నారు. అసంక్రమిత వ్యాధుల సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంతో పాటు ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో ఓపీ ఫాలోఫ్ యాక్షన్ సక్రమంగా ఉండాలన్నారు. సమావేశంలో సీపీఓ విజయ్‌కుమార్, డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగప్రసాద్, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, బీసీ సంక్షేమ శాఖ అధికారి నిర్మలజ్యోతి, నోడల్ ఆఫీసర్ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పవర్‌లూమ్స్‌లో తనిఖీలు



పవర్ లూమ్స్‌ను పరిశీలిస్తున్న అధికారులు

సోమందేపల్లి: మండల కేంద్రంలోని పవర్ లూమ్స్ యూనిట్లలో మంగళవారం ఉదయం చేనేత జౌళిశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేపట్టారు. మరమగ్గాలకు సంబంధించి నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా నిర్వాహకులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ రాజారావు హెచ్చరించారు. సప్తగిరి కాలనీ, గీతానగర్ ప్రాంతాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం పర్యటించింది. కాగా, విషయం ముందస్తుగా తెలుసుకున్న పలువురు తమ యూనిట్లకు తాళం వేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్ మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ అప్పాజి తదితరులు పాల్గొన్నారు.

ఈతకెళ్లి విద్యార్థి మృతి



శ్రీధర్ (ఫైల్)

చెన్నేకొత్తపల్లి: ఈతకెళ్లిన ఓ విద్యార్థి ప్రమాదవశాత్తు రాయి మీదపడడంతో నీట మునిగి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... చెన్నేకొత్తపల్లి మండలం బసంపల్లి గ్రామానికి చెందిన సుబ్బరాయుడు కుమారుడు శ్రీధర్(11) మంగళవారం మధ్యాహ్నం స్నేహితులతో కలసి గ్రామ శివారులోని వ్యవసాయ బావి వద్దకు ఈతకు వెళ్లాడు. ఈత కొట్టి బావి గట్టుపై నిలబడి చూస్తుండగా రాయి విరిగి బావిలో పడ్డాడు. ఆ వెనుకనే రాయి మీద పడడంతో తీవ్ర గాయమై నీట మునిగాడు. గమనించిన స్థానికులు వెంటనే బావిలో దూకి బాలుడిని వెలికి తీసే లోపు మృతిచెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు.

ఆలయంలో హుండీ అపహరణ

పెద్దపప్పూరు: మండలంలోని సుంకేసులపల్లి, కుమ్మెత గ్రామాల మధ్య ఉన్న ఇటీవల నిర్మించిన గంగమ్మ ఆలయంలో హుండీని ఆగంతకులు ఎత్తుకెళ్లారు. మంగళవారం తెల్లవారుజామున దుండగులు ఆలయంలోకి చొరబడి సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. అనంతరం హుండీని ఎత్తుకెళ్లి పొలాల్లో ధ్వంసం చేసి, అందులోని భక్తుల కానుకలను అపహరించుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇదంతా వైఎస్ చలువే...

- ఎత్తిపోతల పథకం పునఃప్రారంభంతో పెరిగిన భూగర్భ జలాలు
- పచ్చని పొలాలతో కళకళలాడుతున్న గ్రామాలు
- రైతుల జీవితాల్లో నిండిన వెలుగులు

తాడిమర్రి: టీడీపీ హయాంలో నిర్వీర్యమైన ఎత్తిపోతల పథకాన్ని పునః ప్రారంభించడంలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చూపిన చొరవ సత్ఫలితాలను ఇస్తోంది. ఈ ప్రాజెక్ట్ కింద 300కు పైగా ఎకరాల్లో పంటలు పచ్చదనాన్ని సంతరించుకున్నాయి. గ్రామాలు పాడిపంటలతో కళకళలాడుతున్నాయి.

చంద్రబాబు హయాంలో మూత

ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న 1992లో అప్పటి ధర్మవరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి గరుడమ్మగారి నాగిరెడ్డి చొరవతో తాడిమర్రి మండలం రామాపురం వద్ద ఎత్తిపోతల పథకం ప్రారంభమైంది. 552 ఎకరాలకు సాగు నీరు అందించడమే లక్ష్యంగా రూ.52 లక్షలతో పులివెందుల బ్రాంచ్ కెనాల్ (పీబీసీ) నుంచి ఆ క్యూసెక్కుల నీటి వాటాతో ఎత్తిపోతల పథకాన్ని అప్పట్లో ప్రారంభించారు. ఇందు కోసం 40 హెచ్‌పీ సామర్థ్యమున్న మూడు మోటార్లను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత దొడ్డిదారిన అధికారం చేజిక్కించుకున్న చంద్రబాబు హయాంలో ఈ పథకం పూర్తిగా నిర్వీర్యమైంది. 1997లో మోటార్లు మరమ్మతుకు గురవ్వడంతో పూర్తిగా అటకెక్కించారు. 2004లో అధికారం పగ్గాలు చేపట్టిన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని రామాపురం ఎత్తిపోతల పథకాన్ని పునః ప్రారంభించారు. మోటార్ల మరమ్మతులు, కాలువ ఆధునికీకరణ తదితర పనులకు పెద్ద మొత్తంలో నిధులు విడుదల చేశారు. ఫలితంగా అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఈ పథకం నిర్విఘ్నంగా కొనసాగుతూ వస్తోంది. ఎత్తిపోతల ద్వారా అందుతున్న నీటితో ఈ ప్రాంతం చుట్టుపక్కల భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయి. వందలాది ఎకరాల్లో వేరుశనగ, మిరప, చీనీ తదితర పంటలు సాగులోకి వచ్చాయి. నీరు సమృద్ధిగా అందుబాటులోకి రావడంతో వ్యవసాయ పనులు ఊపందుకుని గ్రామాల్లో వర్గ కక్షలు దూరమయ్యాయి.



రామాపురం వద్ద ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకం



సాగవుతున్న చీనీతోట

కావాల్సినంత నీరు

చంద్రబాబు హయాంలో మోటార్లు మరమ్మతుకు గురై ఎత్తిపోతల పథకం మూతపడింది. పంటల సాగు భారమైంది. 2004లో అధికారంలోకి వచ్చిన వైఎస్ రాజశేఖరరెడ్డి మా ఇబ్బందులు తెలుసుకుని వెంటనే పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసి మోటార్లు రిపేరి, కాలువ ఆధునికీకరణ పనులు చేయించారు. దీంతో ఎత్తిపోతల పథకం జీవం పోసుకుంది. గ్రామాల్లో భూగర్భ జలాలు పెరిగి బోర్లు, వ్యవసాయ బావుల్లో నీరు కావాల్సినంత దొరుకుతోంది. దీంతో పంటల సాగు చేస్తూ సుఖశాంతులతో జీవిస్తున్నాం.

– కుంటాల పుల్లయ్య, రామాపురం, తాడిమర్రి

వ్యవసాయం పండుగ

ఎత్తిపోతల పథకంతో వ్యవసాయం పండుగలా మారింది. నాకున్న కొద్దిపాటి భూమిలో చీనీ, వేరుశనగ, మిరప, కనకాంబరం తదితర పంటలు సాగు చేస్తున్నా. భూగర్భ జలాలు పెరగడంతో వేసవిలోనూ పంటలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి.

– చిన్నగురప్ప, రామాపురం, తాడిమర్రి

హిజ్రాలకు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయండి

- ఏపీ సాక్స్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కామేశ్వరప్రసాద్

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రికి వచ్చే హిజ్రాల సౌకర్యార్థం ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, ఆర్ఎంఓ డాక్టర్ వైవీ రావును ఏపీ సాక్స్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కామేశ్వరప్రసాద్ ఆదేశించారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన జీజీహెచ్‌లోని ఐసీటీసీ సెంటర్‌ను తనిఖీ చేశారు. హెచ్ఐవీ పరీక్షలు, బాధితులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వారి పట్ల సానుకూల ధోరణితో వ్యవహరించాలని సూచించారు. విధుల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వన్‌స్టాప్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్, డీపీఎం వెంకటరత్నం, సూపర్‌వైజర్ రమణ తదితరులున్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి:

పీహెచ్‌సీ, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవందించాలని సంబంధిత వైద్యాధికారులను డాక్టర్ కామేశ్వరప్రసాద్ ఆదేశించారు. అనంతపురం నగర శివారులోని రాజీవ్‌కాలనీ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, కురుకుంట పీహెచ్‌సీలను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. హెల్త్ క్లినిక్‌లకు వచ్చే రోగులకు చేపట్టే వైద్య పరీక్షలు, మందుల స్టాక్‌పై ఆరా తీశారు. సీహెచ్‌ఓలకు అందించే శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు అందజేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్, సీహెచ్‌ఓలు ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ కామేశ్వరప్రసాద్

నెలాఖరుకు పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు

- రాష్ట్ర పాఠశాల పాఠ్యపుస్తకాల బోర్డు డైరెక్టర్ లక్ష్మీనారాయణ

ఉరవకొండ: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెలాఖరు లోపు అన్ని పాఠశాలలకు పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలు సరఫరా చేయాలని సంబంధిత అధికారులను రాష్ట్ర పాఠశాల పాఠ్యపుస్తకాల బోర్డు డైరెక్టర్ లక్ష్మీనారాయణ ఆదేశించారు. మంగళవారం ఆయన ఉరవకొండ ఎస్కే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పాఠ్యపుస్తకాలు నిల్వ చేసిన గోదామును పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 80 శాతం మేర పాఠ్య పుస్తకాలను ఆయా మండలాలకు చేర్చినట్లు తెలిపారు. ఉరవకొండ మండలానికి సంబంధించి 1,13,426 పాఠ్యపుస్తకాలు అవసరం కాగా, 35,544 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, మిగిలిన పుస్తకాలు వారం రోజుల్లోపు చేరుతాయన్నారు. 10వతరగతి పాఠ్యపుస్తకాలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండగా.. 6, 7, 9 తరగతులకు చెందిన పాఠ్యపుస్తకాలు అందాల్సి ఉందన్నారు. నోట్ బుక్కులు సైతం కొంత మేర రావాల్సి ఉందన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభానికే ముందే ప్రభుత్వం పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలు అందించేందుకు చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రమౌళి, వైకేపీ ఏపీఎం గంగన్న స్టాక్ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.



పాఠ్యపుస్తకాల నిల్వలు పరిశీలిస్తున్న లక్ష్మీనారాయణ

పల్లెకు టికెట్ ఇవ్వొద్దు

- సమావేశంలో పెదరాసు వర్గం తీర్మానం

పుట్టపర్తి: మాజీ మంత్రి, పుట్టపర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ పల్లె రఘునాథరెడ్డికి అసమ్మతి సెగ తగిలింది. ఆ పార్టీ సీనియర్ నేత పెదరాసు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మంగళవారం బుక్కపట్నంలో అసమ్మతి నేతలందరూ సమావేశమై ఈ సారి ఎన్నికల్లో పార్టీ టికెట్ ఇవ్వరాదంటూ తీర్మానం చేసి అధిష్టానానికి పంపారు. సమావేశంలో పెదరాసు మాట్లాడుతూ.. పల్లె కంటే పార్టీలో తామే సీనియర్లమని పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేశామని పల్లెలా పార్టీని అడ్డం పెట్టుకుని రూ.కోట్లు సంపాదించలేదని మండిపడ్డారు. పార్టీ బలోపేతానికి తాము సమావేశాలు ఏర్పాటు చేస్తుంటే వద్దనేందుకు నీవెవరూ అంటూ ప్రశ్నించారు. నీవెక్కడి వాడవని నిలదీశారు. స్థానికేతరుడైన పల్లెకు కాకుండా ఈ సారి పార్టీ టికెట్ తమకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పల్లెను బేషరతుగా నియోజకవర్గం వీడి వెళ్లాలన్నారు. .2009, 2014 ఎన్నికల్లో పల్లెను గెలిపిస్తే అడ్డగోలు సంపాదనకే ప్రాధాన్యతనిస్తూ పార్టీ కార్యకర్తలను, నాయకులను, బీసీల అభ్యున్నతిని ఏనాడూ పట్టించుకోలేదని పీసీ గంగన్న విమర్శించారు. 2014లో పార్టీ విజయానికి తాము పడిన కష్టాన్ని వివరించారు. పుట్టపర్తి మున్సిపాలిటీ చైర్మన్‌గా తాను ఎన్నికైనప్పుడు తన ఎదుగుదలకు పల్లె రఘునాథరెడ్డి అడుగడుగునా అడ్డుపడ్డాడని ఆరోపించారు. నిధులున్నా పుట్టపర్తిలో అభివృద్ధి పనులు చేపట్టకుండా అడ్డుకున్నారని మండిపడ్డారు. 2024లో పార్టీ విజయం సాధించాలంటే పల్లెకు టికెట్ ఇవ్వకుండా వేరొకరికి ఇవ్వాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకులు కేశప్ప, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చెన్నకేశవులు, నాగప్ప, మైనార్టీ నాయకుడు అల్లాబకాష్ తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో ఓడీచెరువు మాజీ ఎంపీపీ ఇస్మాయిల్, కొత్తచెరువు శ్రీనాథ్, అగ్రహారం వరదప్ప, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పెదరాసు సుబ్రహ్మణ్యం

ప్రతి విద్యార్థికీ యూనిఫాం అందాలి

- జెడ్పీ సీఈఓ భాస్కరరెడ్డి

ఉరవకొండ: విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న ప్రతి విద్యార్థికీ ప్రభుత్వం అందజేసిన యూనిఫాం, బూట్లు అందజేయాలని మండల విద్యాశాఖాధికారులను జిల్లా పరిషత్ సీఈఓ భాస్కరరెడ్డి ఆదేశించారు. ఉరవకొండలోని ఎస్కే ప్రభుత్వ పాఠశాలను మంగళవారం సందర్శించారు. ప్రభుత్వం సరఫరా చేసిన యూనిఫాం దుస్తుల నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వం ఈ ఏడాది విద్యార్థులకు మరింత మెరుగైన డిజైన్‌లో ఆకర్షణీయమైన యూనిఫాం దుస్తులు పంపిణీ చేసిందన్నారు. ఒక్కో విద్యార్థికి మూడు జతలకు సరిపడ యూనిఫాం దుస్తులతో పాటు షూస్, బెల్ట్, టైను తల్లిదండ్రులకు అందజేస్తారని, దుస్తుల కుట్టు కూలిని ఆయా విద్యార్థుల తల్లుల ఖాతాలోకి ప్రభుత్వం నేరుగా చేస్తుందని తెలిపారు. కార్పొరేట్ విద్యార్థులను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అన్ని హంగులను ప్రభుత్వం సమకూర్చిందని, ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పిల్లల చదువులపై శ్రద్ధ వహించాలని తల్లిదండ్రులకు సూచించారు. సీఈఓ వెంట ఎంపీడీఓ చంద్రమౌళి, తదితరులు ఉన్నారు.



యూనిఫాం దుస్తుల నాణ్యతను పరిశీలిస్తున్న సీఈఓ భాస్కరరెడ్డి

పరిశ్రమల ఏర్పాటుకు సహకరిస్తే ఉపాధి కల్పిస్తాం

- ఆర్డీఓ తిప్పేనాయక్

ధర్మవరం అర్బన్: పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూములు ఇచ్చేందుకు ముందుకు వచ్చే రైతులకు కచ్చితంగా ఉపాధి కల్పిస్తామని ఆర్డీఓ తిప్పేనాయక్ పేర్కొన్నారు. చెన్నేకొత్తపల్లి మండలంలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూ సేకరణకు మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి చెన్నేకొత్తపల్లి మండలంలోని రైతులు, రెవెన్యూ అధికారులు హాజరయ్యారు. ఆర్డీఓ మాట్లాడుతూ... సర్వే నంబర్లు 433, 435, 436, 437, 500, 503లో దాదాపు 320 ఎకరాల్లో పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామిక వేత్తలు ముందుకు వచ్చారన్నారు. ఇందు కోసం 45 మంది రైతులు తమ భూములను ఇవ్వాల్సి ఉంటుందన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో భవిష్యత్తులో నిరుద్యోగ సమస్య తీరుతుందన్నారు. ఎకరాకు రూ.35లక్షల పరిహారం ఇవ్వాలని రైతులు కోరారని, అయితే రూ.25 లక్షలు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వివరించారు. అయితే రూ.25 లక్షలతో తమ భూములను ఇవ్వలేమంటూ రైతులు పేర్కొనడంతో విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఆర్డీఓ భరోసానిచ్చారు. సమావేశంలో డీఏఓ ఖతిజున్‌ఖుబ్రా, హంపయ్య, చెన్నేకొత్తపల్లి తహసీల్దార్ సుబ్బలక్ష్మి, కంపెనీ జోనల్ మేనేజర్ మురళీ మోహన్, సీఎస్‌డీటీ అనురాధ, వీఆర్వో తులసమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ తిప్పేనాయక్

స్కిల్‌హబ్‌లో నూతన కోర్సులు

హిందూపురం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఏపీ (సీడాప్) సంయుక్తంగా హిందూపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న స్కిల్ హబ్ సెంటర్‌లో నూతన కోర్సులు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ హరీష్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యూమ్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 25వ తేదీ నుంచి 'కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ నాన్ వాయిస్', 'అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్' కోర్సులు ప్రారంభించనున్నారు. ఇంటర్ ఉత్తీర్ణత, డిగ్రీ ఆపై విద్యాభ్యాసం పూర్తి చేసిన వారు అర్హులు. శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. ఆసక్తి ఉన్న వారు ముందస్తుగా పేర్లు నమోదు చేసుకోవాలి. పూర్తి వివరాలకు 79815 41994, 93471 89696లో సంప్రదించవచ్చు.

కారు బోల్తా - ఒకరి మృతి



మృతుడు వలీబాషా

ధర్మవరం రూరల్: ప్రమాదవశాత్తు కారు బోల్తాపడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం నగరానికి చెందిన ఆటో డ్రైవర్ వలీబాషా (48), కారు డ్రైవర్ చంద్రశేఖర్, లిల్లీబాబా సొంత పనిపై హిందూపురానికి వెళ్లి మంగళవారం కారులో తిరుగు ప్రయాణమయ్యారు. ధర్మవరం మండలం సీతారాంపల్లి వద్దకు చేరుకోగానే టైరు పేలడంతో కారు పల్టీలు కొడుతూ రోడ్డు పక్కనే గుంతలోకి దూసుకెళ్లింది. వలీబాషా అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన చంద్రశేఖర్, లిల్లీబాబాను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నట్లు సమాచారం. ఘటనపై ధర్మవరం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పశుశాఖలో బదిలీలు

అనంతపురం అగ్రికల్చర్: పశుసంవర్ధకశాఖలో బదిలీల పర్వం మొదలైంది. మంగళవారం స్థానిక పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో ఉమ్మడి అనంతపురం జిల్లా అధికారులు డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం, డాక్టర్ శుభదాస్ సమక్షంలో ఆఫీస్ సబార్డినేటర్లు, వెటర్నరీ అసిస్టెంట్ల బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. రెండు జిల్లాల పరిధిలో 15 మంది ఆఫీస్ సబార్డినేటర్లు, ఒక వెటర్నరీ అసిస్టెంట్‌కు బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు. మిగిలిన విభాగాల్లో అప్షన్ల ప్రక్రియ కొనసాగుతోంది.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములుకండి

- డీఎఫ్ఓ శ్యామల



మొక్కలు అందజేస్తున్న డీఎఫ్ఓ శ్యామల

పుట్టపర్తి అర్బన్: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సామాజిక వన విభాగం డీఎఫ్ఓ శ్యామల పిలుపునిచ్చారు. పుట్టపర్తిలోని దీనజనోద్ధరణ ప్రభుత్వ కార్యాలయాల కాంప్లెక్స్‌లో వివిధ శాఖల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మేరీ లైఫ్ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. సర్వజీవుల మనుగడకు కారణమైన పర్యావరణానికి హాని కలగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఏడు అంశాలతో రూపొందించిన మేరీ లైఫ్ కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిక్షణపై ప్రజలను చైతన్య పరచనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో శక్తిని కాపాడడం, వ్యర్థాలను తగ్గించడం, ఎల్రక్టానిక్ వ్యర్థాలను పూర్తిగా నిరోధించడం, ఆరోగ్యవంతమైన జీవన విధానం, సుస్థిర ఆహారపు అలవాట్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించక పోవడం, జల సంరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మొక్కలు పంపిణీ చేసి, మేరీ లైఫ్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో జిల్లా చేనేత, ఆడిట్, ట్రైబల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, ఫిషరీస్, మార్కెటింగ్, పరిశ్రమ తదితర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి



మృతుడు దాదాపీర్

హిందూపురం: స్థానిక ఆర్టీఓ కార్యాలయం సమీపంలో హస్నాబాద్‌కు చెందిన దాదాపీర్ (19) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. హిందూపురం రెండో పట్టణ ఎస్ఐ వెంకటరమణ తెలిపిన మేరకు... దాదాపీర్‌కు తల్లిదండ్రులు లేరు. వ్యసనాలకు బానిస. జులాయిగా తిరిగేవాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఆర్టీఓ కార్యాలయం సమీపంలో రైలు పట్టాలపై మృతదేహమై కనిపించాడు. శరీరంపై కాలిన గాయాలున్నాయి. ఎవరైనా హత్య చేసి ఇక్కడ పడేశారా? లేదా ఆత్మహత్య చేసుకున్నాడా? అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీంతో అనుమానాస్పద మృతి కింద పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఉపాధ్యాయుడికి దేహశుద్ధి

గోరంట్ల: ఓ మహిళతో అసభ్యకరంగా ఫోన్ సంభాషణ చేసిన ఉపాధ్యాయుడికి బాధితురాలి తరపు బంధువులు దేహశుద్ధి చేశారు. వివరాలు.. సోమందపల్లి మండలంలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు గోరంట్లలో నివాముంటున్నాడు. స్థానికంగా ఉంటున్న ఓ మహిళకు ఫోన్‌లో చాటింగ్ చేస్తూ కాల్ చేసి అసభ్యకరంగా మాట్లాడేవాడు. విషయాన్ని కుటుంబసభ్యుల దృష్టికి ఆమె తీసుకెళ్లడంతో ఉపాధ్యాయుడిని జీనవాండ్లపల్లి సమీపంలోని ఓ కాలనీ వద్దకు రప్పించుకుని దేహశుద్ధి చేశారు. ఈ విషయం తెలుసుకున్న కొందరు మధ్యవర్తులు ఉపాధ్యాయుడి తరపున జోక్యం చేసుకుని పోలీసు కేసు పెట్టకుండా మహిళ బంధువులను రాజీ చేసినట్లు సమాచారం.

యువకుడి ఆత్మహత్యాయత్నం

శింగనమల: ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆ సమయంలో తీసిన సెల్ఫీ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడం చర్చనీయాంశమైంది. పోలీసులు తెలిపిన మేరకు.. శింగనమల మండలం తరిమెల గ్రామానికి చెందిన సులోచన, ఆమె కుమార్తె ప్రియదర్శినిని 2021, నవంబర్ 21న అదే గ్రామానికి చెందిన రాజేష్, హేమంత్‌కుమార్ అసభ్య పదజాలంతో దూషించారు. దీంతో ఘర్షణ చోటు చేసుకోవడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఈ కేసు హియరింగ్‌కు వచ్చింది. దీంతో రాజీ కావాలంటూ తల్లీకుమార్తెపై ఒత్తిడి పెంచారు. ఈ క్రమంలో సోమవారం మరోసారి వారిని దూషించడంతో వారు డయల్ 100కు కాల్ చేసి ఫిర్యాదు చేశారు. దీంతో ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి, విచారణ అనంతరం ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు. అయితే మహిళలపై కేసు నమోదు చేయలేదన్న అపోహతో మంగళవారం రాజేష్ విషపూరిత ద్రావకం తాగుతూ సెల్ఫీ వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేశాడు. విషయం తెలుసుకున్న వెంటనే రాజేష్‌ను కుటుంబసభ్యులు సర్వజనాస్పత్రిలో చేర్పించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.